
సాక్షి
బాపట్ల
శుక్రవారం । 22 । డిసెంబర్ । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 522.60 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.



భవానీ దీక్ష ఏర్పాట్ల పరిశీలన

విజయవాడ : ఇంద్రకీలాద్రిపై జనవరి 3వ తేదీ నుంచి జరిగే భవానీ దీక్ష విరమణల ఏర్పాట్లను గురువారం డీసీపీ విశాల్‌గున్ని పరిశీలించారు.



కబడ్డీ పోటీల్లో గుంటూరు సత్తా

విజయనగరం : సీఎం వైఎస్ జగన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని విజయ నగరంలో నిర్వహించిన మహిళల కబడ్డీ పోటీల్లో గుంటూరు జిల్లా జట్టు నాలుగో స్థానంలో నిలిచింది.

న్యూస్‌రీల్

నేడు 'ఆడుదాం ఆంధ్రా' ర్యాలీ

నరసరావుపేట: ఆడుదాం..ఆంధ్ర కార్యక్రమాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం 6.45 గంటలకు మున్సిపల్ కార్యాలయం నుంచి ఎస్ఎస్ఎన్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహిస్తున్నారు. దీనికి జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాదు ముఖ్యఅతిథులుగా హాజరు కానున్నట్లు పౌరసంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ దీప్తి గురువారం వెల్లడించారు.

27న నిధి ఆప్‌కే నికత్

గుంటూరు ఎడ్యుకేషన్ : గుంటూరులోని ఉద్యోగుల భవిష్యనిధి (ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయ ఆధ్వర్యంలో ఈనెల 27న నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఇంద్రనీల్ ఘోష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు కృష్ణనగర్‌లోని పీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంతో పాటు ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహించబడుతుందని తెలిపారు. యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లతో పాటు ఇతర వాటాదారులు, లబ్ధిదారులతో పరస్పరం ముఖాముఖీగా చర్చలు జరుగుతాయని తెలిపారు. పీఎఫ్ భాగస్వామ్య యజమానులందరు కార్యక్రమానికి విధిగా హాజరై, ఫిర్యాదులు ఉంటే వాటిని పరిష్కరించేందుకు వీలుగా ఉద్యోగులతో పాటు అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. తెనాలిలోని జీడీసీసీ బ్యాంక్, కృష్ణాజిల్లా పామర్రులోని రాణి ఆక్వాఫీడ్స్ ప్రైవేటు లిమిటెడ్, ప్రకాశం జిల్లా దర్శిలోని ప్రశాంత స్కూల్, విజయవాడ ఒన్‌టౌన్‌లోని కేబీఎన్ కాలేజీ, అద్దంకి నగర పంచాయతీ కార్యాలయంతో పాటు వినుకొండలోని మున్సిపాల్టీ హాల్లో జరిగే నిధి ఆప్‌కే నికత్‌లలో ఫిర్యాదులు, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

నేటి నుంచి పాలిటెక్నిక్ విద్యార్థినులకు క్రీడా పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్ : గుంటూరు జిల్లా 26వ అంతర్ పాలిటెక్నిక్ మహిళా క్రీడా పోటీలను శుక్ర, శనివారాల్లో గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. ప్రభాకరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 29 పాలిటెక్నిక్‌ల నుంచి 400 మంది విద్యార్థినులు పాల్గొంటున్న క్రీడా పోటీల్లో భాగంగా వాలీబాల్, ఖో-ఖో, చెస్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, రిలే, షాట్‌పుట్, డిస్క్ త్రో, లాంగ్ జంప్, హై జంప్, లాంగ్ జంప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. క్రీడా పోటీలను సీఐడీ ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్పీ కేజీవీ సరిత ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు



తెనాలి: గుంటూరు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23–25 తేదీల్లో స్థానిక అన్నాబత్తుని సత్యనారాయణ స్టేడియంలో రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించనున్నారు. పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం సాయంత్రం స్టేడియంలో ఆవిష్కరించారు. ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఈదర వెంకట పూర్ణచంద్, కార్యదర్శి ఈదర శ్రీనివాసరావు, విశ్రాంత ప్రిన్సిపాల్ గుత్తా వెంకటరత్నం, పీఏ సునీల్, ఆలపాటి కిరణ్, వీరవల్లి శ్రీధర్, ఎలీషా, స్టేడియం కోచ్ కె.నాగరాజు, జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

యార్డుకు 48,735 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 45,238 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 48,735 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 24,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,500 నుంచి రూ.20,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.9,000 నుంచి 23,400 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 23,372 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు.

జనోత్సవం.. దివ్యోత్సవం

నవ్యాంధ్ర నవరత్నాల రేడు.. సంక్షేమ జీవన ప్రదాత.. జన హృదయ విజేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా ఊరూవాడా సంబరాలు అంబరాన్నంటాయి. పేదల లోగిళ్లలో ఉత్సాహం ఉరకలెత్తింది. మదిమదిలో కొలువుదీరిన వరాల రాజుకు దీవెనలు వెల్లువెత్తాయి. ఇది జనోత్సవం.. దివ్యోత్సవం అంటూ దిక్కులన్నీ నినదించాయి. దీర్ఘాయుష్మాన్ భవ అంటూ మనసారా ఆశీర్వదించాయి. వైఎస్సార్ సీపీ శ్రేణుల సేవా కార్యక్రమాలు జనాభిమానం చూరగొన్నాయి.



భట్టిప్రోలులో జరిగిన వేడుకల్లో పాల్గొన్న మంత్రి మేరుగ నాగార్జున, సమన్వయకర్త అశోక్‌బాబు



చెరుకుపల్లిలో కేక్ కట్ చేస్తున్న రాజ్యసభ సభ్యులు మోపిదేవి, సమన్వయకర్త ఈపూరి గణేష్



చీరాలలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి



మార్టూరులో కేక్ కట్ చేసి తినిపిస్తున్న సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్



కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్సీ పోతుల సునీత

పేదల పండుగ జగనన్న జన్మదినం

- ఇంటింటా వెల్లివిరిసిన ఆనందం
- ఊరువాడా అంబరాన్నంటిన సంబరాలు
- పలుచోట్ల సేవా కార్యక్రమాలు

సాక్షి నెట్ వర్క్: జననేత, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు కేక్ కట్ చేశారు.

- భట్టిప్రోలు మార్కెట్ యార్డులో నిర్వహించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలలో మంత్రి మేరుగ నాగార్జున, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు, బౌడ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు పాల్గొన్నారు. కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు.
- చెరుకుపల్లిలో జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలలో రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈపూరు గణేష్ పాల్గొన్నారు. ఈఎస్ఆర్ ఆస్పత్రిలో గణేష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని మోపిదేవి ప్రారంభించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.
- చీరాలలో ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు.
- మార్టూరులో పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ పాల్గొని కేక్ కట్ చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు చేశారు.
- అద్దంకిలో నియోజకవర్గ ఇన్‌చార్జి పాణెం హనిమిరెడ్డి పాల్గొని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు.
- అద్దంకి పార్టీ కార్యాలయంలో శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య పాల్గొని కేక్ కట్ చేశారు.
- చీరాల ఎమ్మెల్సీ పోతుల సునీత ఆమె నివాసంలో కేక్ కట్ చేశారు.
- బాపట్ల రథం బజారులో భారీ కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రారంభించారు. ఎమ్మెల్యే కోన రఘుపతి సతీమణి రమాదేవి రక్తదానం చేసి బాపట్ల ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.
- రేపల్లె పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, వైస్ చైర్మన్ జి.ప్రశాంత్‌కుమార్, వైఎస్సార్ సీపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు గడ్డం రాధాకృష్ణమూర్తి, గాదె వెంకయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.



బాపట్ల రథం బజారులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి



అద్దంకిలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పాణెం హనిమిరెడ్డి

ట్యాబ్‌లతో విద్యార్థులకు మెరుగైన విద్య

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ట్యాబ్‌ల ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా అన్నారు. విద్యా సంక్షేమ, సమగ్ర శిక్ష అభియాన్ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లోని ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. జిల్లాలోని విద్యార్థులంతా తిలకించేలా ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు చేశారు. అందులో భాగంగా జిల్లాలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ట్యాబ్‌లను అందించారు. విద్యా రంగం అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన యాప్‌ల వినియోగంతో విద్యార్థుల ఆలోచనలు, మేథోశక్తి పెరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 11,462 మంది విద్యార్థులకు బైజూస్ యాప్ ఎక్కించిన ట్యాబ్‌లను అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ చెప్పారు. ఇప్పటివరకు 6,554 ట్యాబ్‌లు రాగా, మిగిలిన 4,908 ట్యాబ్‌లు ఐదు రోజుల్లో జిల్లాకు వస్తాయని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న వనరులను విద్యార్థులు అందిపుచ్చుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. జిల్లా సంయుక్త కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, జిల్లా విద్యాశాఖ అధికారి పీవీ రామారావు, జెడ్పీటీసీ సభ్యులు ఎస్తేరురాణి, అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్లు మృతి

టైరు మార్చుకుంటున్న లారీని ఢీకొట్టిన మరో లారీ

మార్టూరు: మార్టూరు సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు లారీ డ్రైవర్లు అక్కడికక్కడే మృతి చెందారు. ఈఘటన గురువారం ఉదయం 5 గంటల సమయంలో జరిగింది. సీఐ పీ అక్కేశ్వరరావు వివరాల మేరకు.. ఓ లారీ రాయపూర్ నుంచి ఇనుప లోడుతో మధురై వెళ్తోంది. మార్టూరు, తాతపూడి మధ్య వెనుక టైరు పంక్చరవడంతో డ్రైవర్ రాజు లారీ కిందకు దిగి టైరు మార్చుకుంటున్నాడు. ఇదే మార్గంలో భద్రాచలం నుంచి టంగుటూరు వెళ్తున్న లారీ రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో లారీ కింద ఉన్న డ్రైవర్ రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల ద్వారా ప్రమాద విషయం తెలుసుకున్న సీఐ, ఎస్ఐ శ్రీనివాసరావుతో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్యాబిన్‌లో ఇరుక్కున్న వెనుక లారీ డ్రైవర్ అజయ్ సురేష్‌ను అతి కష్టం మీద వెలుపలికి తీయగా అప్పటికే అతడు మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. అధికారులు క్రేన్‌లను రప్పించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. లారీ డ్రైవర్ల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



క్యాబిన్‌లో ఇరుక్కున్న మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ

రేపు వైకుంఠపురంలో ఉత్తరద్వార దర్శనం

తెనాలి: తెనాలి పట్టణంలోని వైకుంఠపురంలో ఉన్న శ్రీ లక్ష్మీపద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ముక్కోటి ఏకాదశి (వైకుంఠ ఏకాదశి)కి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కుంభం సాయిబాబు, సహాయ కమిషనర్/కార్యనిర్వహణాధికారి ఎం.తిమ్మనాయుడు తెలిపారు. ముక్కోటి ఏకాదశి పర్వదిన వాల్‌పోస్టర్‌ను గురువారం ఆలయంలో పాలకమండలి సమక్షంలో వారు ఆవిష్కరించారు. ఆ రోజు తెల్లవారుజామున 4.30 గంటల నుంచి శ్రీ స్వామి అమ్మవార్లు వైకుంఠద్వారం నందు భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్ల ఏర్పాటు, తాగునీరు, ఉచిత ప్రసాద పంపిణీ, దూరప్రాంత భక్తుల కోసం ఉచిత అన్నప్రసాద పంపిణీ జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్‌బోర్డు సభ్యులు కనికచర్ల చరణరత్న సందీప్, కురగంటి సునీత, బొద్దులూరి సరస్వతి, మావులూరి శ్రీనివాస్, ముంతా దుర్గాప్రసాద్, బట్టు దుర్గారావు, దేవరకొండ వెంకటరమణ, ఎక్స్‌అఫీషియో సభ్యులు అళహరి రవికుమార్, బొద్దులూరి నాగేశ్వరరావు, కురగంటి రవిశంకర్, దేవరకొండ శంకరరావు పాల్గొన్నారు.

అనుభవదారులకు చట్టబద్ధ హక్కులు

- మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున
- 662 మందికి పట్టాలు పంపిణీ



భట్టిప్రోలులో పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి నాగార్జున, బౌడ చైర్మన్ దేవినేని, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు

భట్టిప్రోలు: దేశ చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో కృష్ణానది పరీవాహక లంక గ్రామాల సొసైటీ భూముల అనుభవ దారులను చట్టబద్ధంగా హక్కులు కల్పిస్తూ పట్టాలు పంపిణీ చేయడం చిరస్థాయిగా నిలిచిపోతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. భట్టిప్రోలు మార్కెట్ యార్డులో గురువారం జరిగిన కార్యక్రమంలో మంత్రి నాగార్జున బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబులతో కలసి అనుభవదారులకు పట్టాలు పంపిణీ చేశారు. మంత్రి నాగార్జున మాట్లాడుతూ తరతరాలుగా లంక భూములు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు లేకపోవడం వల్ల రుణాలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ఇకపై ఆ పరిస్థితి ఉండదన్నారు. రాష్ట్రంలో కుల, మత, వర్గ, విబేధాలకు తావు లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి అందించాలన్నదే సీఎం జగన్ ధ్యేయమన్నారు. బౌడ చైర్మన్ దేవినేని మాట్లాడుతూ లంక భూములపై దశాబ్దాలుగా ఆధారపడి జీవిస్తున్న దళితులకు హక్కులు దక్కడంతో గొప్ప ఆస్తి సమకూరిందన్నారు. సీఎం తీసుకున్న ఈ నిర్ణయంతో ఎంతో మంది పేదలకు లబ్ధి చేకూరుతుందన్నారు. వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు మాట్లాడుతూ దళితులకు భూ పంపిణీతోపాటు వాటిపై సర్వ హక్కులు కల్పిస్తూ సీఎం వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమన్నారు. తొలుత సమన్వయకర్త అశోక్‌బాబును మంత్రి నాగార్జున సభికులకు పరిచయం చేశారు. వేమూరు నియోజకవర్గ ప్రజలు తనపై చూపిన అభిమానాన్ని అశోక్‌బాబుపై కూడా చూపి రాబోయే ఎన్నికల్లో వేమూరులో మరలా వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయాలని ఆకాంక్షించారు. భట్టిప్రోలు మండలంలో ఓలేరు, పెదపులివర్రు, వెల్లటూరు, పెదలంక లంక భూములు, భట్టిప్రోలు సొసైటీకి చెందిన 662 మందికి 258.32 ఎకరాలకు సంబంధించి పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, సర్పంచ్ దారా రవికిరణ్మయి, పట్టణ అధ్యక్షులు కుందేటి రమేష్, పార్టీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు(నాని), ఉప సర్పంచ్ బుర్లె రామప్రసాద్, వైస్ ఎంపీపీలు కొతరపు పిచ్చయ్యశాస్త్రి, మల్లోలు ఉషారాణి, కో–ఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు, గోవర్ధనగిరి చినబుజ్జి, గుమ్మడి సాంబశివరావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ శేరు శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ తూనుగుంట్ల శ్రీధర్, తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, అమృతలూరు, చుండూరు ఎంపీపీలు రాపర్ల నరేంద్ర, జాలాది రూబెన్, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ విభాగాల నేతలు పాల్గొన్నారు.

కొల్లూరు(వేమూరు): కొల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం జరిగిన కార్యక్రమంలో మంత్రి మేరుగ నాగార్జున రైతులకు పట్టాలు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ వేమూరు నియోజక వర్గం పరిధిలోని ఓలేరు నుంచి చింతర్లంక గ్రామం వరకు నది పరీవాహకలో సొసైటీ భూములు సాగు చేసుకొని రైతులు పంటలు పండించుకుంటున్నారని, ఈ భూముల పట్ల రైతులకు పూర్తి హక్కులు లేక పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి పలుమార్లు తీసుకెళ్లగా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజున కొల్లూరు మండలంలోని 459 మంది రైతులకు పూర్తి హక్కులతో కూడిన పట్టాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గం సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులు సాగు చేసుకుంటున్న భూములకు పూర్తి హక్కులు కల్పించడంతో రైతులు అనేక ప్రభుత్వా పథకాలు పొందడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ, యల్లమాటి మోహన్ జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు, వైఎస్ ఎంపీపీ మురాల రాంబాబు, పార్టీ మండల అధ్యక్షులు సూర్యదేవర రామకృష్ణ, జేసీఎస్ కన్వీనర్ ఐలా సుబ్బారావు, యార్డు చైర్మన్ ఉప్ప శిరీష, మాజీ ఎంపీపీ పెరికల పద్మారావు, కూచిపూడి మోషే, నర్రా బుల్లిబాయి, బొల్లిముంత ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

చిరకాల సమస్య పరిష్కారం



కొన్నేళ్లుగా లంక గ్రామాల సొసైటీ భూములకు పూర్తి హక్కులు లేక ఇబ్బందులు పడ్డాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లంక గ్రామాల సొసైటీ భూములకు పూర్తి హక్కులు కల్పించారు. సీఎం మేలు జన్మలో మరిచిపోలేం.

రత్నాకర్, రైతు, చింతర్లంక

మా భూములకు పూర్తి హక్కు వచ్చింది



లంక గ్రామాల్లో సొసైటీ భూములు సాగు చేస్తున్న రైతులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి హక్కులు కల్పించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు దేవుడు లాంటి వాడు.

మాణిక్యరావు, రైతు, దోనేపూడి

శాంతి, ప్రేమకు ప్రతీక క్రీస్తు

- గుంటూరు కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి
- వైభవంగా సెమీ క్రిస్మస్ వేడుక

గుంటూరు వెస్ట్: శాంతి, ప్రేమకు ఏసుక్రీస్తు ప్రతీకని, ఆయన జన్మించిన డిసెంబర్ నెలకు ప్రత్యేకత ఉందని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. గురువారం రాత్రి గుంటూరు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ, క్రైస్తవ మైనార్టీ ఆర్థిక సంస్థ సంయుక్తాధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుక నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్రీస్తు బోధనలు అనుసరణీయమన్నారు. జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ కులమత ప్రాంతాలకు అతీతంగా ప్రపంచ వ్యాప్తంగా ప్రజలంతా క్రిస్మస్ పండుగను జరుపుకుంటారన్నారు. బిషప్ డాక్టర్ చిన్నాబత్తిని భాగయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రైస్తవులకిచ్చిన హామీలు నెరవేరుస్తున్నారని కొనియాడారు. కేక్ కట్ చేశారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలు, గాయకులు ఆలపించిన క్రీస్తు గీతాలు అలరించాయి. రాష్ట్ర క్రిస్టియన్ అఫైర్స్ సలహాదారు మద్దు బాలస్వామి, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం. శేషగిరిరావు ఉన్నారు.

ఎస్‌ఐ ఉద్యోగాలకు ఎంపిక

పెయింటర్ నుంచి ఎస్‌ఐ వరకు..



జే.పంగులూరు: గురువారం విడుదల చేసిన ఎస్‌ఐ పరీక్ష ఫలితాల్లో పంగులూరు గ్రామానికి చెందిన కీర్తిపాటి పవన్ కుమార్ ఉత్తీర్ణత సాధించారు. కీర్తిపాటి పవన్‌కుమార్ వ్యవసాయి కూలీ కుటుంబానికి చెందిన వ్యక్తి. పదేళ్ల కిందట తండ్రి రామాంజనేయులు అనారోగ్యంతో చనిపోయాడు. ఇతనికి ఒక అక్క, తమ్ముడు ఉన్నారు. తండ్రి కోల్పోవడంతో తల్లి సునీత కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేది. ఎంతో కష్టపడి కూలి పనులు, పెయింట్ పనులు చేసుకుంటూ డిగ్రీ వరకు చదివాడు పవన్‌కుమార్. అనంతరం రెండు సంవత్సరాల నుంచి ఎస్సై అవ్వాలని పట్టుదలతో కష్టపడి చదివి ఉత్తీర్ణుడయ్యాడు. గ్రామస్తులు పవన్‌కుమార్‌ని అభినందించారు.

కోలలపూడి యువకుడు ఎంపిక

మార్టూరు: మండలంలోని కోలలపూడి గ్రామానికి చెందిన గాలి రాంబాబు ఎస్సై ఎంపికయ్యాడు. గురువారం రాత్రి వెలువడిన ఎస్‌ఐ పరీక్ష ఫలితాలలో రాంబాబు ఉత్తీర్ణుడై అర్హత సాధించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రాంబాబు కోలలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి, విజయవాడ శ్రీచైతన్యలో ఇంటర్మీడియట్, చిలకలూరిపేట డీఆర్‌ఎస్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి రైల్వేలో ఉద్యోగం చేస్తూ ఎస్‌ఐ పరీక్ష రాసి ఉత్తీర్ణుడు కావడం గమనార్హం. తమ గ్రామానికి చెందిన యువకుడు ఎస్‌ఐగా ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యమంత్రి జగన్ సారథ్యంలోనే రాష్ట్ర పురోభివృద్ధి

- మంత్రి మేరుగ నాగార్జున
- భట్టిప్రోలులో ఘనంగా సీఎం జగన్ జన్మదిన వేడుకలు

భట్టిప్రోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం పురోభివృద్ధి సాధిస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని గురువారం భట్టిప్రోలు మార్కెట్ యార్డ్‌లో ఘనంగా నిర్వహించారు. మంత్రి నాగార్జున బౌడ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ వరికూటి అశోక్‌బాబులతో కలసి కేక్ కట్ చేశారు. వారికి ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, సర్పంచ్ దారా రవికిరణ్మయిలు స్వయంగా కేక్ తినిపించారు. కార్యక్రమానికి పట్టణ అధ్యక్షులు కుందేటి రమేష్ అధ్యక్షత వహించారు. మంత్రి నాగార్జున మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజాభిమానాన్ని చూరగొన్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో మరలా జగన్‌ను సీఎం చేసేందుకు అందరూ కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు(నాని), వైస్ ఎంపీపీలు కొతరపు పిచ్చయ్యశాస్త్రి, మల్లోలు ఉషారాణి, కో–ఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు గోవర్ధనగిరి చినబుజ్జి, గుమ్మడి సాంబశివరావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ శేరు శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ తూనుగుంట్ల శ్రీధర్, ఎంపీటీసీ సభ్యులు దారావత్ కుమారిభాయ్, నీలా సాంబమ్మ, గద్దె సుశీల, నన్నెపాముల చంటి, డొక్కు నాగకుమారి, సర్పంచులు చౌటూరి లక్ష్మి, బొల్లెద్దు రాజమ్మ, వేములపల్లి వెంకటేశ్వరరావు, మోర్ల విజయలక్ష్మి, అమృతలూరు, చుండూరు ఎంపీపీలు రాపర్ల నరేంద్ర, జాలాది రూబెన్, వివిధ విభాగాల నేతలు బొల్లిముంత ఏడుకొండలు, మద్దుల గిరి, తదితరులు పాల్గొన్నారు.

దేశంలో అగ్రగామిగా ఆంధ్రప్రదేశ్

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణరావు

చెరుకుపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారధ్యంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల్లో దేశంలోనే అగ్రగామిగా నిలుస్తుందని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా వైఎస్సార్ సీపీ మండలం కమిటీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలోను, రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త ఈవూరి గణేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అభిమానుల సమక్షంలో భారీ కేకులు కట్ చేశారు. తొలుత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి ఎంపీ మోపిదేవి నాయకులతో కలసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఈఎస్‌ఆర్ హాస్పిటల్‌లో వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త ఈవూరి గణేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఎంపీ మోపిదేవి ప్రారంభించారు. గుళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మోపిదేవి వెంకట రమణారావు, ఈవూరి గణేష్ మొక్కలు నాటారు. వైద్యశాల ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రేపల్లె నియోజకవర్గానికి సమన్వయకర్తగా డాక్టర్ ఈవూరి గణేష్‌ను నియమించారని, దీనిని పార్టీ నాయకులు అందరూ స్వాగతించి రానున్న ఎన్నికల్లో రేపల్లె నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఈవూరి గణేష్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కర్యకర్తలకు పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో త్వరలోనే డాక్టర్ ఈవూరి గణేష్‌కు నాయకులను, కార్యకర్తలను పరిచయ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మోపిదేవి తెలిపారు. కార్యక్రమాల్లో బౌడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, ఎంపీపీ మత్తి దివాకర రత్న ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు మరివాడ పావని, ఈవూరి కేశవతి, పార్టీ మండల కన్వీనర్ పైనం ఏడుకొండరెడ్డి, పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి చెన్ను కోటేశ్వరరావు, చీరాల ప్రసాద్‌రెడ్డి, కామినేని కోటేశ్వరరావు, ఈవూరి సృజన్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి మళ్లీ సీఎం వైఎస్ జగనన్నే

ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డియేనని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా బాపట్ల రథం బజారులో భారీగా కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే కోన రఘుపతి సతీమణి రమాదేవి రక్తదానం చేసి బాపట్ల ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కోన మాట్లాడుతూ రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. మతాలు చూడం..వర్గాలు చూడం.అర్హతే ఆధారంగా అందరికి సంక్షేమ ఫలాలు అందిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి వాటిని అమలు చేసి చూపారన్నారు. ప్రజలకు నేరుగా సంక్షేమ ఫలాలు ఇంటి వద్దకే అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. భావితరాలకు బంగారు భవిష్యత్ అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ రావాలని ప్రజలు మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారని తెలిపారు. సచివాలయాల వ్యవస్థతో నేడు ప్రభుత్వ పథకాలు నేరుగా అందటంతోపాటు ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. గ్రామీణ స్థాయి నుంచే పాలన అందించటంతోపాటు శాశ్వత భవనాల ఏర్పాటుతో మరో 50, 60సంవత్సరాలపాటు ప్రభుత్వ భవనాలకు కొరతలేదన్నారు. బాపట్ల వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షులు కె.సుధీర్‌బాబు, కోకి రాఘవరెడ్డి, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, మార్కెట్ యార్డు చైర్మన్ డి.సీతారామిరెడ్డి, నాయకులు గవిని కృష్ణమూర్తి, చేజర్ల నారాయణరెడ్డి, చింతల రాజశేఖర్, ఇ.మాల్యాద్రి, వి.డేవిడ్ పాల్గొన్నారు.

శాసనాలను పరిశీలించిన అధికారులు

జే.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు భీమలింగేశ్వర దేవాలయం 900 ఏళ్ల చరిత్ర కలిగినదని భారతీయ పురావస్తుశాఖ శాసన విభాగం డైరెక్టర్ ఎం ఏసుబాబు, చరిత్ర పరిశోధకుడు విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, అలగేషణ్ తెలియజేశారు. గురువారం భీమలింగేశ్వర దేవాలయంలోని శాసనాలు వారు పరిశీలించారు. భారతీయ పురావస్తు శాఖ పరిశోధకులు ఎం ఏసుబాబు మాట్లాడుతూ కొణిదెన చోళులు అయిన త్రిభువన మల్లుడు అనే రాజు పంగులూరులో స్వామి వారి దేవాలయం నిర్మించి, భూదానం చేసినట్లు ఆలయ ప్రాంగణంలో శాసనాలు చెప్తున్నాయన్నారు. బల్లికురవ మండం కొణిదెన గ్రామం రాజధానిగా చేసుకొని తూర్పున బంగాళాఖాతం, దక్షిణం పాకనాల, ఉత్తరం కృష్ణానది, దక్షిణం నన్నూరు వరకు వారు పరిపాలించనట్లు తెలిపారు. అనంతరం ఈ ప్రాంతాన్ని కాకతీయులు, యాదవ రాజులు, రెడ్డి రాజులు, విజయనగరం రాజులు, వెంకటగిరి రాజులు, మహమ్మదీయులు, జమిందారులు, ఆంగ్లేయులు ఇలా పరిపాలించుకుంటు వచ్చారన్నారు. 500 ఏళ్ల నాడు వెంకటగిరి రాజులు అయిన కుమార తిమ్మనయా చంద్రుడు ఆలయానికి ధూపదీప నైవేద్యాలు నిమిత్తం కొంత పొలం దానం ఇచ్చినట్లు ఇక్కడి శాసనాలు చెబుతున్నాయన్నారు. ఇంతటి ఘన చరిత్ర ఉన్న ఆలయ శాసనాలు విషయంలో ఇక్కడి వారు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



దేవాలయంలో శాసనాలు పరిశీలిస్తున్న చరిత్ర పరిశోధకులు



అద్దంకి పార్టీ కార్యాలయంలో జరిగిన సీఎం జగన్ జన్మదిన వేడుకలలో మాట్లాడుతున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

50 సవర్ల బంగారం అపహరణ

పర్చూరులో పట్టపగలు చోరీ

పర్చూరు (చినగంజాం): పర్చూరులో గురువారం పట్టపగలు చోరీ జరిగింది. స్థానిక అద్దంకి నాంచారమ్మ అమ్మవారి వీధిలోని డొప్పలపూడి అంజమ్మ ఇంట్లో గుర్తు తెలియని దుండగులు 30 సవర్ల బంగారం దోచుకెళ్లారు. ఆమె ఇంట్లోని లేని సమయంలో దొంగలు ఇంటి వెనుక నుంచి గోడ దూకి ఇంట్లోనికి ప్రవేశించారు. బీరువా తాళాలు పగులగొట్టి అందులోని 30 సవర్ల బంగారం, రూ.లక్ష నగదు అపహరించారు. ఇంటికి తిరిగి వచ్చిన బాధితురాలు అంజమ్మ బీరువా తెరచి ఉండటాన్ని గమనించి ఆశ్చర్యానికి లోనయింది. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ అక్కేశ్వరరావు, ఎస్‌ఐ రవిశంకర్‌రెడ్డి కేసు విచారణ చేపట్టారు.

వైద్యశాలలను సందర్శించిన ప్రపంచబ్యాంకు బృందం



వైద్యశాలలో వైద్యులతో మాట్లాడుతున్న ప్రపంచ బ్యాంకు బృందం

చినగంజాం: మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలను ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు గురువారం సందర్శించారు. జిల్లా వైద్యాధికారి పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వారు చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలోని వసతులు, ఫార్మసీ, ఆపరేషన్, చికిత్సలకు సంబంధించిన గదులు, వాటి నిర్వాహణ తదితర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యులు ఎస్ విజయభాస్కర్, సాయి శ్రీ చరణ్‌లతో కలిసి ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య చికిత్స గురించి ఆరా తీశారు. ఆస్పత్రికి వచ్చే ఔట్ పేషంట్‌లు, గతంలో ఓపీ, ప్రస్తుతం ఓపీ గురించి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో నిర్వహిస్తున్న డెలివరీల సంఖ్యను గురించి వైద్యులను అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. సంతరావూరు ఆరోగ్య కేంద్రం పరిధిలోని కడవకుదురు గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్న వైద్యశిబిరాన్ని సందర్శించి వైద్యాధికారి కీర్తి సరోజ్‌ను పలు అంశాలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఝాన్సీ, సూపర్ వైజర్ చిరంజీవి, ఉల్దారాణి, ఎల్‌టీ శ్యాంసుదర్, డీవో పాదిలి రాఘవ, సిబ్బంది నర్సులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన టూరిస్ట్ బస్సు

- టూరిస్ట్ బస్‌లోని 30 మంది క్షేమం
- బస్సు కోసం వేచి ఉన్న వ్యక్తులపై దూసుకెళ్లిన వైనం



రోడ్డు మార్జిన్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఢీకొట్టిన టూరిస్ట్ బస్సు

చినగంజాం: టూరిస్ట్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో రోడ్డు పక్కన బస్సు కోసం వేచి ఉన్న ప్రమాణికులు గాయాలు పాలుకాగా భారీ విద్యుత్ ప్రమాదం తప్పింది. ఈ ఘటన గురువారం సాయంత్రం చినగంజాంలో చోటుచేసుకుంది. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం చినగంజాం బైపాస్‌రోడ్‌లోని టీ జంక్షన్ వద్ద చీరాల వెళ్లేందుకు చినగంజాం గ్రామం నుంచి చీరాల వెళ్లేందుకు ఇద్దరు ప్రయాణికులు పసుపులేటి మస్తాన్‌లావు, పసుపు లేటి నరసింహరావు, సోపిరాల గ్రామానికి చెందిన మరో యువకుడు తుమ్మలపెంట అజయ్‌కుమార్ వారిని బస్సు ఎక్కించేందుకు వచ్చి రోడ్డు పక్కన మార్జిన్‌లో వేచి ఉన్నారు. అదే సమయంలో సూళ్లూరుపేట నుంచి పెళ్లి నిశ్చితార్థమై చీరాల వెళుతున్న టూరిస్ట్ బస్సు సుమారు 30 మంది ప్రయాణికులతో ఒంగోలు వైపు నుంచి వస్తోంది. టూరిస్ట్ బస్సు ఒక్కసారిగా రోడ్డు పక్కన నిలబడి ఉన్న ముగ్గురు వ్యక్తులపై దూసుకొని వెళ్లి పక్కనే ఉన్న మినీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీ కొట్టింది. ఈఘటనలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తెగికింద పడిపోగా అదృష్టవశాత్తూ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రోడ్డు పక్కన వేచి ఉన్న ముగ్గురు తప్పించుకునే ప్రయత్నం చేయగా స్వల్పగాయాలయ్యాయి. ద్విచక్రవాహనంతో నిలబడిన వారిలోని ఒక వ్యక్తి బస్సు కింద ఇరుక్కుపోవడంతో అతనిని తీసేందుకు జేసీబీలు తెప్పించి స్థానికులు బయటకు తీశారు. భారీ విద్యుత్ షాక్ నుంచి తప్పించుకోవడంతో బస్సులోని ప్రయాణికులు 30 మంది ఊపిరి పీల్చుకున్నారు. గాయాలపాలైన పసుపులేటి మస్తాన్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ పీ ప్రకాష్ తెలిపారు. టూరిస్ట్ బస్సు డ్రైవర్‌కు ఫిట్స్ సమస్య ఉండటంతో స్టీరింగ్ కంట్రోల్ చేయలేకపోయాడని ప్రయాణికులు చెపినట్లు పోలీసులు తెలిపారు.

జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

బాపట్ల అర్బన్: జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా స్థాయిలో పాఠశాల విద్యార్థులకు గురువారం వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించారు. బాపట్ల పట్టణంలోని ఏబీవీ ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహించారు. పోటీల్లో జిల్లాలోని పలు మండలాల నుంచి 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వక్తృత్వం తెలుగు మీడియం విభాగంలో కొండమంజులూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని బి.వేదశ్రీ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఇంగ్లీష్ మీడియం విభాగంలో బూదవాడ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి జి.మురళీకృష్ణ ప్రథమస్థానం సాధించాడు. వ్యాసరచనలో తెలుగు మీడియం విభాగంలో కొండమంజులూరు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని బి.భవ్యశ్రీ, ఇంగ్లీష్ మీడియం విభాగంలో బూదవాడ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని ఎం.శ్రీవల్లి ప్రథమ స్థానంలో నిలిచారు. క్విజ్‌లో వలపర్ల విద్యార్థిని వి.శరణ్య ప్రథమ స్థానం కైవసం చేసుకున్నది. విజేతలను డీఈఓ రామారావు అభినందించారు. కార్యక్రమం బాపట్ల జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాదిక్, కౌశల్, కోఆర్డినేటర్ పి.భాను చంద్రమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు.